ఇన్ని సదుపాయాలు
గల ఇళ్లను మనకు
ఎవరు అందిస్తున్నారో
తెలుసా —
సిరి బిల్డర్స్ అండ్
రియల్ ఎస్టేట్స్‌వారు.
విజయవాడలో ఎన్నో
అపార్టుమెంటులు కట్టి
ఎంతో అనుభవం
గడించిన పెద్ద సంస్థ




# 'అనుబంధం'

బారెడు పొద్దెక్కింది. చురకలు వేసే సూర్యుడి తీక్షణమైన కిరణాలను కూడా లెక్కచేయకుండా తాతలనాటి కుర్చీని బాగుచేయడంలో నిమగ్నమైపోయాడు రాఘవయ్య. అతను నిజంగా బతకలేని, బతకడం చాతకాని ఓ బడిపంతులు. ఆ కుర్చీతో అతనికి 70 ఏళ్ళ అనుబంధం. ఆ ఇంటితో ఆ కుర్చీకి నాలుగు తరాల అనుబంధం. రాఘవయ్య ముత్తాతకి ఆ వూరి రాజాగారు బహుమానంగా ఇవ్వడంతో ఆ కుర్చీ వీళ్ళింటికి వచ్చింది.

అప్పట్నుంచి దీనిమీదే రాఘవయ్య ముత్తాత న్యాయం చెప్పాడు. తాత మునసబుగిరీ చేశాడు. నాన్న ఆస్తిని హారతి కర్పూరం చేశాడు. తనూ ఈ కుర్చీ మీదే ఇన్నాళ్ళుగా పిల్లలకు పాఠాలు చెప్తూ జీవనం సాగిస్తున్నాడు.

"పనికిరాని ఆ పాతకుర్చీపై అంత మోజెందుకు నాన్నా! అది మునుపలాగూ బాగుచెయ్యలేవు. విరిచి పొయ్యిలో పారేస్తే సరి - ఆ స్థలంలో కొత్త సోఫాసెట్ తెచ్చుకోవచ్చుగా - ఎన్నిసార్లు చెప్పినా వినవు - నీ చాదస్తం నువ్వు" విశ్వం సణుగుడులో రాఘవయ్యకు కోపం రాలేదు - పైకి సన్నగా నవ్వాడు. కానీ ఎక్కడో గుండె లోతుల్లో బాధ కలుక్కుమంది. ఇదే విశ్వం చిన్నప్పుడు ఈ కుర్చీ కోసం ఎంత మారాం చేసేవాడని. తనని కూడా కూర్చోనిచ్చేవాడు కాదు. పెళ్ళయ్యాక మరీ మారిపోయాడు విశ్వం.

డబ్బు-డబ్బు-డబ్బు — ప్రపంచంలో డబ్బును మించినదేదీ లేదు కాబోలు ఈ కాలంవాళ్ళకి. మనసులో గొణుక్కున్నాడు రాఘవయ్య. ఆ రోజు ఉదయాన్నే టవున్ కెళ్ళి పెన్షన్ తీసుకుని సాయంత్రం ఇల్లు చేరుకున్నాడు. గేట్లోకి అడుగెట్టగానే వరండాలోకి చూసిన రాఘవయ్య గుండెల్లో పిడుగుపడింది. తన కుర్చీ లేదు. ఆ స్థానంలో సోఫా. ఒక్క అంగలో లోపలికెళ్ళాడు. "విశ్వం - విశ్వం" అరిచాడు రాఘవయ్య.

"అమ్మా, నాన్న లేరు తాతయ్యా. గుడికెళ్ళారు" మనవడి గొంతులో విసుగు.

"నా కుర్చీ ఏమయిందిరా?"

"పాతదయి పనికిరాకుండా పోయిందిగా! అడ్డంగా ఎందుకని విరిచి పొయ్యిలో వేశారు నాన్న."

"అవును - పాతపడి పనికిరాకుండా పోతే నిప్పుల పాలు కావలసిందేగా - తనూ అంతే ఆ కుర్చీలాగే తనూ ఎవరికీ అక్కరలేదు" రాఘవయ్య కళ్ళల్లో బాధ కన్నీరుగా జారింది. ఆ రాత్రంతా నిదుర పోలేదు రాఘయ్య - తెల్లారేసరికి శాశ్వతంగా నిద్ర పోయాడు. కుర్చీతోపాటూ తనూ మంటల్లో కాలిపోయాడు.

—యజ్ఞావధ్యుల

# అసూయ

జీవితంలో ముఖ్యమైన ఘట్టం, తప్పనిసరి మలుపు వివాహం. ప్రతి ఒక్కరు కాబోయే జీవిత భాగస్వామి గురించి కలలు కనడం సహజం. సునీతకూడా అందరిలాగే తన పదహారో ఏటనుండి ఎన్నో కలలుకంది. కాని కుటుంబ పరిస్థితులు ఆమె కలలను కలలుగానే ఉంచాయి. గుమాస్తాగా పని చేస్తున్న తండ్రి రిటైర్ కావటంతో ఇద్దరు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ల బాధ్యత సునీతపై పడింది. తండ్రి ఉద్యోగం కూతురుకిచ్చారు.

ఆడపిల్లకు పెళ్లిచేసి తమ బాధ్యత తీర్చుకోటానికి బదులు తామే ఆమెకు బరువుగామారినందుకు చాలా బాధపడ్డారు తల్లిదండ్రులు. సునీత పెళ్లి చేయాలని సంబంధాలు తెస్తే, తన తర్వాత తమ్ముడికి ఉద్యోగం దొరికే వరకు పెళ్లి చేసుకోనంది.

తన పెళ్లికి సునీత అడ్డంకిగా ఉన్నదని చెల్లెలు బాధపడుతుంటే, తల్లిదండ్రులకు నచ్చచెప్పి ఆమె ప్రేమించిన వాడితో పెళ్లి జరిపించింది.

తమ్ముడికి ఉద్యోగం వచ్చింది. సునీతకు ముప్పై ఏళ్ళు వచ్చాయి. పెళ్ళిపైన ఆశ వదులుకొని తాను కన్న కలలకు మనసులోనే సమాధి కట్టేసి నిర్లిప్తంగా బతుకుతున్న సునీతను పెళ్ళి చేసుకుంటానంటూ కోరి వచ్చాడు సుధాకర్.

పెళ్ళి కూతురి అలంకరణలోఉన్న సునీత అద్దంలో చూసుకుంటూ కల్లలవుతాయనుకున్న కలలు నిజమవుతున్నందుకు ఆనందసాగరంలో మునిగి, అందమైన రేపటిగురించి ఆలోచిస్తు ఊహల అలలపై తేలిపోతున్న సునీతవద్దకు కంగారుగా వచ్చాడు తండ్రి. ఏదో చెప్పాలని చెప్పలేక మధన పడతున్నాడు "ఏమిటి నాన్నా" ఆందోళనగా అడిగింది.

"మరి... పెళ్ళివారు మన సంబంధంవద్దని వెళ్ళిపోయారు" సునీతను పట్టుకుని బావురుమన్నాడు.

కాళ్ళకింద భూమి కంపిస్తున్నట్లయింది. నిశ్చేష్టగా నిలబడిపోయింది.

పెళ్ళి క్యాన్సిల్ అయినందుకు కారణం తండ్రి తన నోటితో చెప్పలేకపోయినా తర్వాత తెలిసింది. సునీత క్యారెక్టర్ మంచిది కాదని ఎవరో ఉత్తరం వ్రాసారట.

తనపెళ్ళి చెడగొట్టిన వాళ్లు ఎవరో పరాయి వాళ్లుకాదని, ప్రాణస్నేహితులనుకున్న సరోజ, శారదలేనని ముప్పై అయిదేళ్ళు వయసున్న తమకు జతగా ఉన్న సునీత పెళ్లి కుదిరిపోవటంతో ఓర్వలేక, అసూయతో పెళ్ళిని చెడగొట్టారని ఎప్పటికీ తెలిసే అవకాశం లేదు సునీతకు.

—కిరణ్మయి